


*(గత సంచిక తరువాయి)*

**ఆ ఆదివారం సాయంత్రం** సరిగ్గా నాలుగున్నరకి త్రివిక్రం అపార్టుమెంట్ డోర్ బెల్ మోగింది. సుందరేశన్ తలుపు తెరిస్తే తలుపు అవతల నిలబడ్డ ఇద్దరిలో ఒకరు చెప్పారు.

"త్రివిక్రం గారిని కలవాలని వచ్చాం"

వారిద్దరూ అన్నదమ్ములని పోలికని బట్టి సుందరేశన్ గ్రహించాడు. వారిలో ఒకరు స్ఫూర్తి తండ్రి అనికూడా ఊహించాడు.

"రండి. కూర్చోండి" వారిద్దరినీ సాదరంగా లోపలికి ఆహ్వానించి సోఫాని చూపించాడు.

త్రివిక్రం గది తలుపు దగ్గర నిలబడి చెప్పాడు.

"మీ కోసం ఎవరో వచ్చారు."

డోర్ బెల్ విని అప్పటికే కంప్యూటర్‌ని ఆఫ్ చేసిన త్రివిక్రం కుర్చీలోంచి లేచి బయటకు వచ్చాడు.

"నమస్తే. నేనే త్రివిక్రంని."

వాళ్ళిద్దరూ వెంటనే లేచి నిలబడి అతనితో కరచాలనం చేసారు.

"నేనే స్ఫూర్తి ఫాదర్ బలదేవుణ్ని. ఇతను నా పెద్దన్నయ్య సహదేవుడు."

"నకులుడు రాలేదా?" అని మనసులో అనుకుని బయటకి నవ్వాడు.

"కూర్చోండి."

ముగ్గురూ కూర్చున్నాక త్రివిక్రం సహదేవుడి వైపు చూస్తూ అడిగాడు.

"మీరేం చేస్తున్నారు?"

"నేను రిటైర్డ్ సూపరింటెండెంటింగ్ ఇంజనీర్‌ని. ఆర్ అండ్ బి నించి క్రితం సంవత్సరమే రిటైరయ్యాను. మా తమ్ముడు బి.హెచ్.ఎల్‌లో మెయిన్‌టెన్స్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఇంకో పదేళ్ళ సర్వీసు ఉంది. మావాడు నాకు విషయాలన్నీ చెప్పాడు. మీదే ప్రాంతం? తోడబుట్టిన వారు ఉన్నారా? మీ గురించి చెప్పండి" సహదేవుడి మాటల్లో గడుసుతనాన్ని వంట గదిలోని సుందరేశన్ గుర్తించాడు.

త్రివిక్రం తన గురించి వివరంగా చెప్పాడు. బలదేవుడికి తన అన్న సహదేవుడంటే గౌరవం అని ఆయన ప్రవర్తన వల్ల త్రివిక్రంకి అనిపించింది.

"వెరీ గుడ్ వయసులో తేడా ఒక్కటే మా అందరికీ అభ్యంతరంగా ఉంది. కానీ చేసుకునే పిల్లకే అది అభ్యంతరం కానప్పుడు, ఇక మేం వెనక్కి వెళ్ళదలచుకోలేదు. మా తమ్ముడి పిల్లలు తెలివి గలవాళ్ళనే ఇంప్రెషన్ మా బంధువుల్లో ఉంది. వాడు వాళ్ళని అలా పెంచాడు. ఆ టాలెంట్ నాకు లేదు. మా పెద్దమ్మాయి పెళ్ళయ్యేదాకా ఏ కూర ఎలా వండాలో కూడా నన్నడిగే చేసేది. నాకు వాళ్ళ చిన్నప్పుడే భార్యా వియోగం అయింది. పునర్వివాహం చేసుకోలేదు. అసలు స్ఫూర్తికి ఇంత త్వరలో పెళ్ళని విని ఆశ్చర్యపోయాను. నిన్న

రాత్రి మా ఇంటికి వచ్చి చెప్పాడు. దానికి అమెరికా సంబంధం చెయ్యాలని మా వాడికి ఉంది. మన దేశంలో అన్ని వ్యవస్థలూ ఎంతగా కుళ్ళిపోయాయంటే, ఇక్కడ ఎవరూ సుఖపడలేరని మా అమ్మాయి ఎన్నోసార్లు ఎన్నో విధాలుగా చెప్తూంటుంది."

"మా అన్నయ్యగారమ్మాయి కాలిఫోర్నియాలో శాంటాక్లారాలో ఉంటుంది" బలదేవుడు చెప్పాడు.

"మీ తరపున పెద్దవారు కట్నకానుకలు అవీ మాట్లాడేందుకు ఎవరూ లేరా?" అడిగాడు సహదేవుడు.

"మా పిన్ని, బాబాయిలు వరంగల్‌లో ఉన్నారు. ఇక్కడే ఉంటే వచ్చేవారు. నేను కట్నం తీసుకోదలచుకోలేదు."

"అది ఈ కాలం పిల్లలంతా చెప్పే మాటే కదా"

త్రివిక్రం బాబాయ్, పిన్నిలతో వాళ్ళు స్పీకర్ ఫోన్ ఆన్ చేసి మాట్లాడారు. ఆశ్చర్యంగా అవతలనించి వాళ్ళు ఇద్దరూ పెట్టుపోతల గురించి ఏం అడగలేదు

"మీకెలా బాగుంటుందని తోస్తే అలా చేయండి" చెప్పారు.

నిశ్చితార్థం చేసుకోవటానికి ఓ రోజు ముందుగా వాళ్ళని రమ్మనమని సహదేవుడు ఆహ్వానించాడు. బలదేవుడు వారి ఫోన్ నెంబరు తీసుకుని తేదిని నిర్ణయించాక తెలియచేస్తామని చెప్పాడు.

"నాలుగైదు నెలల్లో ముహూర్తాలు చూడచ్చా? అప్పటికి మీ తల్లిగారు పోయి ఏడాది దాటుతుంది." అడిగాడు సహదేవుడు.

"ఇబ్బందేం ఉండదు" చెప్పాడు త్రివిక్రం.

"ఓసారి యస్ అనుకున్నాక ఇంక దేనికి ఆగటం? అయితే మా ప్రయత్నాల్లో మేముంటాం. మారోజుల్లోలా కాదుగా. ఈ కాలం పిల్లలు 'కట్నం వద్దు, పెళ్ళి ఘనంగా చేసి, లాంఛనాలు పెట్టండి.' అంటున్నారు. మీరు నోరు తెరిచి అదీ అడగలేదు. అయినప్పటికీ మేం చెయ్యాల్సిన లాంఛనాలన్నీ యథావిధిగా చేస్తాం. పెళ్ళి కూడా బాగా చేస్తాం. ఇడ్లీ, దోసె, గార్లిక్ బ్రెడ్, పానీపూరి, సమోస, కట్‌లెట్, నార్త్ ఇండియన్, సౌత్ ఇండియన్ భోజనాలు, ఇంపోర్టెడ్ ఫ్రూట్ బౌల్, ఏడెనిమిది రకాల స్వీట్స్, మూడు రకాల ఐస్‌క్రీంలు. ఇదీ మేమనుకునే భోజనం మెనూ. తలకి ఇది అయిదువందల రూపాయల దాకా అవుతుంది."

ఆ విషయాలని త్రివిక్రం పెద్దగా ఆసక్తి లేకుండా విన్నాడు. వాటిమీద అతనికి బొత్తిగా అవగాహన లేదు.

"మీరు మా అమ్మాయిని మీరు అంటున్నారు. ఇకనించి నువ్వు అనండి."

"అది మీకెలా తెలుసు?"

దానికి బలదేవుడు చెప్పిన సమాధానం విని త్రివిక్రం నివ్వెరపోయాడు.

"స్ఫూర్తికి మీకు మధ్య సంభాషణ అంతా నేను విన్నాక, నాకు అది తెలిసింది."

"ఎలా విన్నారు?" చురుగ్గా చూస్తూ ప్రశ్నించాడు.

"స్ఫూర్తి తన సెల్‌లో దాన్ని రికార్డ్ చేసి తెచ్చి నాకు వినిపించింది."

అయోమయంగా ఆయన వంక చూస్తూ అడిగాడు త్రివిక్రం.

"స్ఫూర్తి మా సంభాషణ రికార్డ్ చేసిందా?"

"అవును."

వెంటనే త్రివిక్రం మొహం పాలిపోయింది.

"ఇది నాకు నచ్చలేదు. దీన్ని గూఢచర్యం అంటారు. మీరు ఓవర్ ప్రొటెక్టివ్‌గా వ్యవహరించారు." ఎర్రబడ్డ మొహంతో చెప్పాడు.

ఆయన చిన్నగా నవ్వి అడిగాడు.

"నాకో ఖరీదైన కారుంది. దాన్ని మీకు ఓ సాయంత్రం డ్రైవ్ చేసే ఆనందం కలిగించడానికి ఇచ్చాననుకోండి. అప్పుడు మీరు ఆ కారు విషయంలో జాగ్రత్తగా ఉంటారా? ఉండరా?"

"ఖచ్చితంగా ఉంటాను."

"దాన్ని మీరు మీ స్వంత కారులా జాగ్రత్తగా చూసుకుంటారా? కారు టైర్లు కీచుమనేలా చప్పుడయ్యేలా బ్రేక్ వేయరు కదా?"

"అవును. వేయను."

"కారుని లారీకో, బస్సుకో దూరంగా గీతలు పడకుండా తీసుకెళ్తారా?"

"అవును"

"నాకు ఈ విషయం చెప్పండి. అలాంటి నా కారు కన్నా నాకు నా కూతురు ఎక్కువ విలువైందా? కాదా?"

"ఎక్కువ విలువైందే"

"మీ దగ్గరకి నా కూతుర్ని ఓ గంట సేపు ఒంటరిగా పంపాను. మీరు నా కారుని ట్రీట్ చేసినంత గౌరవంగా, జాగ్రత్తగా నా కూతుర్ని కూడా చూసుకుంటారో, లేదో తెలుసుకునే హక్కు నాకు ఉందా? లేదా?"

"ఉంది."

"అది రూఢి చేసుకోడానికి తను మీ సంభాషణని రికార్డ్ చేస్తే తప్పా?"

"కాదు" సందేహించకుండా జవాబు చెప్పాడు త్రివిక్రం.

"ఇలాగే మనం చాలా విషయాల్లో చాలామంది తప్పు చేస్తున్నారు అనుకుంటూంటాం. కానీ ఇలా సరైన వివరణతో విషయాన్ని అర్థమయ్యేలా విడమరిస్తే అప్పుడు ఎదుటివాళ్ళని మనం అర్థం చేసుకోవడంలో పొరబడ్డాం అని తెలుసుకుంటాం. నా పిల్లల్ని నేను ఇలా విశ్లేషణలు, ఉదాహరణలు ఇస్తూ పెంచాను. ప్రతీ దానికి స్వంత అభిప్రాయాలు లేకుండా వారు తల్లితండ్రుల మీద ఆధారపడేలా పెంచడం అంటే వారి టైర్లలో గాలి తీసేసినట్లే అని నా అభిప్రాయం."

త్రివిక్రం చివరగా వారిని తన తండ్రి గదిలోకి తీసుకెళ్ళి తండ్రి రాంప్రసాద్‌ని పరిచయం చేసాడు.

"మా తమ్ముడి అమ్మాయిని మీ అబ్బాయికి ఇస్తున్నాం. మీ ఆశీర్వచనం కోరుతున్నాం" నమస్కరించి అడిగాడు సహదేవుడు.

ఆయన మౌనంగా చూసాడు. ఆయన చూపులో ఎక్కడా ఆసక్తి లేదు. బయటికి వచ్చాక చెప్పాడు సహదేవుడు.

"చాలా హారిబుల్ డిసీజ్ ఇది. మా అత్తింటి వైపు ఒకరికి అల్జీమర్స్ వచ్చింది. ఇది నేను చూసిన రెండో కేసు."

సుందరేశన్ అప్పటికే నేతిలో వేయించి ఉప్పు, కారం చల్లిన జీడి పప్పుని ప్లేట్లలో పెట్టి తెచ్చి ఇచ్చాడు. సుందరేశన్‌ని తమ శ్రేయోభిలాషిగా, ఆప్తుడిగా త్రివిక్రం పరిచయం చేసాడు.

వచ్చేప్పుడు తమ ఇంటికి అతన్ని కూడా తీసుకురమ్మని వారు ఆహ్వానించారు.

"రాంప్రసాద్‌గారిని చూసుకోడానికి ఒకరు ఇంట్లో ఉండాలి కాబట్టి నేను రాలేను" సుందరేశన్ చెప్పాడు.

ముహూర్తం నిర్ణయించి, ఫోన్ చేసి చెప్తామని చెప్పి, కాఫీ తాగి వాళ్ళు వెళ్ళాక అడిగాడు త్రివిక్రం "వాళ్ళని చూస్తే మీకేమనిపించింది?"

"చెడ్డవారని అనిపించలేదు. సహదేవుడు కొద్దిగా గడుసు. మాటలు గడుసుగా ఉన్నాయి అంతే."

త్రివిక్రం తన బాబాయ్‌లు ఆదిశంకర్, సోమశేఖర్‌లకి ఫోన్ చేసి ఆ శుభవార్త చెప్పాడు. వారు బాగా సంతోషించారు.

శ్యామలరావు వరుసగా నాలుగురోజులు సెలవు పెట్టాడు. సోమవారం రాత్రి పూనాకి బయలుదేరి వెళ్ళాడు. అక్కడనించి తిరిగి వచ్చాక చెప్పాడు.

"నవనీత్ పూనాలో లేడని తెలిసిందండీ. ఉంటే ఎక్కడైనా అతని పేరు, చిరునామా నమోదయి ఉండాలి. టెలిఫోన్ డైరక్టరీలో వాహనాల రిజిస్ట్రేషన్ రికార్డుల్లో, సేల్స్ టాక్స్, ఇన్‌కంటాక్స్ రికార్డుల్లో ఊహూ. ఎక్కడా నవనీత్, సన్నాఫ్ గోవర్ధన్ పేరు గలవారు ఎవరూ ఆ రికార్డుల్లో లేరు. ఆయన పూనాకి కాక ఇంకెక్కడికైనా వెళ్ళి ఉండాలి. వెరీ సారీ సర్. మీరు హైదరాబాదులో ఇచ్చినట్టుగానే పూనా స్థానిక దినపత్రికల్లో కూడా నవనీత్ గురించి ప్రకటన ఇచ్చాను. ఆయన వివరాలు తెలిపే ఒక్క ఉపయోగకరమైన కాల్ కూడా రాలేదు. పూనాకి కాక మహారాష్ట్రలోని ఇంకేదైనా ఊరికి వెళ్ళి ఉంటాడు."

"నాకు పెళ్ళి కుదిరింది. ఈలోగా ఆయన ఎక్కడ ఉన్నాడో తెలిస్తే బాగుండును." విచారంగా చెప్పాడు త్రివిక్రం.

"కంగ్రాచ్యులేషన్స్ సార్. మీ పెళ్ళి పనులు ఏమైనా ఉంటే నాకు చెప్పండి. చేస్తాను."

"మీరే నాకు కుడి భుజం. మీ చెయ్యి పడకుండా నా పెళ్ళికాదు" నవ్వాడు త్రివిక్రం.

బలదేవుడు, సహదేవులని కలిసిన మర్నాడు త్రివిక్రం స్ఫూర్తికి ఫోన్ చేసి చెప్పాడు.

"ఇందాక ఫోన్ చేసి మీ నాన్నగారు ఆదివారం మీ ఇంటికి ఆహ్వానించారు. బదులుగా మనమంతా ఏదైనా రెస్టరెంట్‌లో కలవచ్చుగా? అది అందరికీ సౌకర్యంగా ఉంటుంది."

"బిల్లు మీరు పే చేస్తే మాకు ఓకేనే. నాన్నగారిని కనుక్కుని చెప్తాను. ఉండండి."

కొద్దిసేపటి తర్వాత బలదేవుడు చెప్పాడు.

"అలాగే బాబు. ఎక్కడ? ఎప్పుడు?"

అందుకు ప్రిపేర్ అయ్యి ఉన్న త్రివిక్రం ఆ వివరాలు ఆయనకి చెప్పాడు.

ఆ ప్రకారం ఆదివారం లంచ్‌కి అంగిటి అనే పంజాబీ రెస్టారెంట్‌లో కలుసుకున్నారు.

"మరో పదేళ్ళల్లో మీ వారికి బయట వర్షం పడుతోందని నీకన్నా ముందే తెలుస్తుంది. ఏ గదిలోకి వెళ్ళినా ఏసి డక్ట్ ఎక్కడ ఉందో అతనికి ఇట్టే తెలుస్తుంది. అద్దం కనపడ్డప్పుడల్లా మనలా జుట్టుని సవరించుకోవడం, దువ్వెనని మర్చిపోయి ఊరెళ్ళినా ఇబ్బంది పడకపోవడం, చక్కగా క్రఫ్ దువ్వుకునే వారికి గాలి వల్ల కలిగే ఇబ్బంది కలగకపోవడం. ఆయన గ్రేట్. ఎందుకంటే ఆయనకి అప్పటికల్లా బట్టతల వచ్చేస్తుంది" దారిలో రవితేజ చెల్లెల్ని ఏడిపిస్తూనే ఉన్నాడు.

పంజాబ్‌లో పొయ్యిని అంగిటి అంటారు. పంజాబ్ రాష్ట్రంలోని ఓ చిన్న గ్రామాన్ని గుర్తుకి తెచ్చేలా ఉంది ఆ రెస్టరెంట్‌లోని అలంకరణ. ఓ బావి, పక్కనే ఏ రోడ్ ఎటు వెళుతుందో బాణం గుర్తులతో సూచించే బోర్డ్. చండీఘర్, అంబాలా, లూధియానా, భటిండా పేర్లు ఆ బోర్డు మీద రాసి ఉన్నాయి. గోడలమీద అతికించిన 1970లలో విడుదలైన అమితాబ్ నటించిన సినిమా పోస్టర్లు కిళ్ళీషాపు, సెక్స్ స్పెషలిస్ట్ బోర్డ్, మరి కొన్ని బోర్డులతో అచ్చం పంజాబీ గ్రామం వాతావరణం అక్కడ కనిపిస్తోంది. పార్టిషన్‌గా కోళ్ళు లేని నులకమంచాలని వాడారు. సర్వ్ చేసిన ఆహారం కూడా బాగుంది. దిల్‌వాలే పనీర్ చిల్లీ, తందూరి మష్రూమ్ బేబి కార్న్, సబ్జీ దా ఖీమా, గార్లిక్ నాన్, బైంగన్ కా బర్తా.. భేండీ మసాలాని ఆర్డర్ చేస్తే చెప్పింది స్ఫూర్తి.

"లేడీస్ ఫింగర్స్‌ని తినకండి, అవి ఏ లేడీస్ చేతులనించి వచ్చాయో తెలియదు కదా మీకు?"

"మా వారికి బెండకాయలు ఇష్టం. స్ఫూర్తి సందీప్‌ని బాగా ఆట పట్టిస్తుంది" త్రివిక్రంతో నవ్వుతూ చెప్పింది స్ఫూర్తి అక్క తరణి.

త్రివిక్రంకి బలదేవుడు బలదేవుడు తన పిల్లలు ఇద్దర్నీ పరిచయం చేసాడు. స్ఫూర్తి అన్న రవితేజ పి.హెచ్.డి చేస్తున్నాడు. స్ఫూర్తి అక్క తరణి. ఆమె భర్త సందీప్, వారి ఇద్దరు పిల్లలు కూడా వచ్చారు. సందీప్ బీరు తీసుకున్నాడు. మిగిలిన ముగ్గురి మగాళ్ళకీ ఆ అలవాటు లేదు.

"ప్లీజ్ డోంట్ త్రో ది సిగరెట్ ఎండ్స్ ఆన్ ది ఫ్లోర్. ది కాక్‌రోచెస్ ఆర్ గెటింగ్ కేన్సర్" తన బావగారితో చెప్పింది స్ఫూర్తి.

"ఊరుకోవే. ఈ హోటల్‌లో సిగరెట్లు నిషేధం" తరిణి చెల్లిలితో చెప్పింది.

బలదేవుడు తన భార్య మరణం గురించి కొంత ఆవేదనగా చెప్పాడు. ఆయనకి తన భార్యంటే ప్రేమ అని త్రివిక్రంకి అనిపించింది.

బిల్లు వచ్చాక త్రివిక్రం చెల్లించబోతే బలదేవుడు తన క్రెడిట్ కార్డుని ఫోల్డర్‌లో ఉంచి చెప్పాడు.

"స్ఫూర్తి మిమ్మల్నే పే చెయ్యమందిట. అలా అనకూడదని దానికి నేర్పాను."

బలదేవుడి ఆ మాటలు త్రివిక్రంకి ఎంతో సంస్కారవంతంగా తోచాయి. కోప్పడ్డానని చెప్పలేదు. నేర్పాను అనటం అతనికి ముచ్చటేసింది.

"తల్లిపోయిన సంవత్సరంలోగా కూతురికి అయితే పెళ్ళి జరగచ్చు. కాని కొడుక్కి ఏడాది తర్వాతే జరగాలి. అంటే ఇంకా ఐదు నెలలు తర్వాత పెళ్ళి జరగాలి. అందుకని ఆ తర్వాతే ముహూర్తం పెట్టించాను. మాకు జాతకాల్లో నమ్మకం లేదు. మీ డేటాఫ్ బర్త్, టైం ఆఫ్ బర్త్‌ని బట్టి మీ జాతకాల ప్రకారం ముహూర్తం పెట్టించాను. వాటిలో ఆదివారం ముహూర్తం మాకు బాగుంది. తెల్లారుఝామున నాలుగున్నరకి ముహూర్తం. లంచ్, రిసెప్షన్ పన్నెండున్నరకి. ఈలోగా పెళ్ళయిపోతుంది కాబట్టి అతిథులని మనమే స్వయంగా రిసీవ్ చేసుకుని పలకరించవచ్చు. మా పెద్దమ్మాయి పెళ్ళి ముహూర్తం ఉదయం పదకొండున్నరకి. అతిథులని రిసీవ్ చేసుకోకుండా పెళ్ళిపీటలమీదే కూర్చోవాల్సి వచ్చింది. పెళ్ళిని ఎంజాయ్ చేయాలంటే అతిథులు రాని ముహూర్తంగా ఉండాలని అప్పుడే నిర్ణయించుకున్నాను. పెళ్ళయ్యాక వారు ఆశీర్వదించి భోజనం చేసి వెళ్తారు" చెప్పాడు బలదేవుడు.

"అయితే ఆ ముహూర్తమే ఖాయం చేయండి. నాకు ఏదైనా ఫర్వాలేదు" త్రివిక్రం ఒప్పుకున్నాడు.

"నీకు పాస్‌పోర్ట్ ఉందా?" నాలుగు నెలల తర్వాత ఓ రోజు స్ఫూర్తిని అడిగాడు త్రివిక్రం.

"లేదు. ఏం?"

"వెంటనే అప్లై చెయ్యి. హనీమూన్‌కి మారిషస్‌కి వెళ్దామన్నావుగా? అందుకు పాస్‌పోర్ట్ అవసరం ఉంటుంది."

"సరే."

"తత్కాల్‌లో అప్లై చేస్తే త్వరగా వస్తుంది" చెప్పాడు త్రివిక్రం.

త్రివిక్రం డబ్బు ఖర్చు అయితే అయ్యిందని, ఓ ప్రైవేటు డిటెక్టివ్ ఏజెన్సీని తన బయోలాజికల్ తండ్రి నవనీత్‌ని కనుక్కోమని నియమించాడు. క్రమంగా వారి పెళ్ళిరోజు దగ్గర పడింది.

## 19

పడమటి యాలేరులోని ఆరోగ్యమాత చర్చిలో ఫాదర్ అలెగ్జాండర్ ఆ ఆదివారం ఉదయం చర్చికి వచ్చిన అరవై రెండుమంది ముందు ప్రవచనం చెప్తున్నాడు.

"ఇవాళ గుడ్ ఫ్రైడే అంటే ఏసు క్రీస్తు శిలువ వేయబడ్డ రోజు. ఉదయం తొమ్మిదికి ఆయన గోల్‌గొతా పర్వత శిఖరం మీద ఇద్దరు దొంగల మధ్య శిలువ వేయబడ్డప్పుడు ఆయన దేహం ఎలా ఉంది? ముళ్ళకిరీటం పెట్టడం వల్ల, కాళ్ళకీ, చేతులకి మేకులు

కొట్టడం వల్ల దేహం రక్తసిక్తమై ఉంది. రోమా సైనికుల కొరడా దెబ్బలతో వీపు ఎరుపెక్కింది. మొహం మీద రోమా సైనికుల ఉమ్ముచారలు. చిత్రవధతో ఛిద్రమైన దేహం గల ఆయన పలికిన ఏడుమాటలు ఇప్పుడు చదువుతాను" చెప్పి అలెగ్జాండర్ బైబిల్‌ని తెరిచాడు. భక్తులంతా కూడా దాన్ని తెరిచారు.

"మొదటి మాట. 'తండ్రీ! వీరు ఏం చేస్తున్నారో వీరికి తెలియదు. వీరిని క్షమించండి' ఎంతటి దయార్ద్ర హృదయం. ఈ క్షమాగుణం కలిగి ఉండటం సమాజానికి హితవు అని మన మీద రాళ్ళు రువ్విన వారిమీద పూలు చల్లాలని చెప్తున్నాడు."

కొందరి కళ్ళు భక్తితో, మరి కొందరి కళ్ళు బాధతో చెమర్చాయి.

"రెండోమాట. తనతో శిలువ వేయబడుతున్న ఓ దొంగ 'నీ రాజ్యంలో నన్ను జ్ఞాపకం చేసుకో' అని ఏసుని ఆయన నిరపరాధి అనే భావంతో అర్థించాడు. దానికి బదులుగా ఏసు 'నేడు నువ్వు నాతో కూడా పరదేశంలో ఉంటావు' అని అభయం ఇచ్చాడు. మనం ఎన్ని తప్పులు చేసినా దేవుడ్ని క్షమించమని అడిగితే మనకి క్షమాభిక్ష దొరుకుతుందని దీన్ని బట్టి మనం గ్రహించవచ్చు. ఏసు మాట్లాడిన మూడోమాట, అక్కడే ఉన్న ప్రియ శిష్యుడు యోహాన్‌ని తన తల్లి మరియమ్మకి చూపించి "అమ్మా ఇడుగో నీ కుమారుడు. ఇదిగో నీ తల్లి' అని చెప్పాడు. ఏసు తనని ప్రేమించిన వారి యోగక్షేమాలు చూస్తాడని దీన్ని బట్టి తెలుస్తోంది. నాలుగోమాట. 'దేవా! దేవా! నా చేతిని ఎందుకు విడిచావు' బాధలో ఉన్నప్పుడు దేవుడ్ని ఏసు ప్రార్థించినట్లుగా మనం దేవుడ్ని ప్రార్థించాలని, తద్వారా మనకి దేవుడి సహాయం లభిస్తుందని, మనం దేవుడి చేతిని పట్టుకుని నడిస్తే మనకి విజయాలే తప్ప వైఫల్యాలు ఉండవని ఇది తెలియచేస్తోంది. వెలుగులో ఒంటరిగా నడిచే కంటే, చీకట్లో దేవుడి చేతిని పట్టుకుని నడవడం ఉత్తమం. ఐదోమాట. 'నాకు దాహంగా ఉంది.' ప్రజలంతా మంచి బాటలో నడవాలన్న ఆత్మీయ దప్పికే అది. ఆరోమాట, 'సమాప్తమైనది' దేవుడు తనకి అప్పగించిన పనిని ఏసు సంపూర్ణంగా నెరవేర్చాడని, అలాగే మనమూ మన పనిని మధ్యలో వదిలివేయకూడదని చెప్పే బోధ అది. ఏడోమాట. 'తండ్రీ! నీ చేతికి నా ఆత్మని అప్పగిస్తున్నాను' దేవుడు బలవంతంగా తీసుకున్నట్లు కాక, స్వచ్ఛందంగా ఇవ్వడం మన మరణం మీద దేవుడికి అధికారం ఉందని ఈ మాట సూచిస్తోంది. ఈ శుభ శుక్రవారం మానవాళి శుభం కోసం ఏసు శిలువలో మరణించడంతో క్రైస్తవాళి ఈ దినాన్ని గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటోంది. ఏసు చూపిన ఈ బాటని అనుసరించేవాడే నిజమైన క్రిస్టియన్ తప్ప ఆదివారాలు బైబిల్‌తో చర్చికి వచ్చేవారు కారు. హల్లెలూయ."

భక్తులంతా 'హల్లెలూయ' అన్నారు. మధ్యలో చర్చిలోకి వచ్చి కూర్చున్న ఆ వ్యక్తిని చూసి అలెగ్జాండర్ పలకరింపుగా నవ్వాడు. కానీ, తను చెప్పే ప్రవచనం ఆపలేదు. ప్రవచనం ముగిసిన తరువాత చర్చి బయటకి వచ్చి బయటకి వెళ్ళే భక్తులకి నమస్కరించి పంపసాగడు. చివరగా వచ్చిన త్రివిక్రంని చూసి ఆయన డగ్గుత్తికగా చెప్పాడు.

"నిన్ను మళ్ళీ చూస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. మీ అమ్మ విషయంలో నేను చేసిన దుర్మార్గత్వానికి ఇక నువ్వు నన్ను మళ్ళీ జీవితంలో కలుస్తావని నేను అనుకోలేదు."

"మీరు జరిగిందానికి పశ్చాత్తాపపడకపోతే మీరనుకున్నట్లు ప్రవర్తించేవాడినేమో? కానీ నిజమైన క్రిస్టియన్‌గా మీ పశ్చాత్తాపం మిమ్మల్ని మంచివారిగా మార్చింది."

"ఏమిటి విశేషం?"

"మిమ్మల్ని నా పెళ్ళికి స్వయంగా ఆహ్వానించడానికి వచ్చాను." శుభలేఖ ఇస్తూ చెప్పాడు త్రివిక్రం.

"సంతోషం."

"వచ్చే ఆదివారమే. మీరు తప్పక రావాలి."

"వస్తాను. నీ తండ్రి ఎవరో తెలిసిందా?"

"ఇంకా లేదు. కానీ నవనీత్ అయి ఉండచ్చని అనుకుంటున్నాను" తన ప్రయత్నాలన్నీ వివరించాడు.

"క్రీస్తుని శిలువ వేసిన ప్రదేశాన్ని చూడాలని ఉందని ఆ రోజు మీరు మాటల్లో చెప్పడం నాకు గుర్తుంది. థామస్ కుక్ అనే ట్రావెల్ ఏజెన్సీ వారం రోజుల ఇజ్రాయిల్ టూర్‌ని కండక్ట్ చేస్తోంది. మీరు వెంటనే పాస్‌పోర్ట్ తీసుకోండి. అక్కడికి వెళ్ళి వచ్చే ఏర్పాటు చేస్తాను. అంతేకాదు. మీరోసారి ఫ్రాన్స్‌లోని లైసెక్స్‌లో ఉన్న సెయింట్ థెరిసా మార్టిన్ నివశించిన మోనాస్ట్రీ గురించి కూడా చెప్పారు. ఇజ్రాయిల్ టూర్ అయ్యాక అక్కడికి వెళ్ళి అదీ చూసుకుని వెనక్కి వచ్చే ఏర్పాటు చేస్తాను."

అలెగ్జాండర్ కళ్ళు కృతజ్ఞతతో చమర్చాయి.

త్రివిక్రం ఆయన చేత తత్కాల్‌లో పాస్‌పోర్ట్‌కి అప్లికేషన్ తీసుకుని ఏఏ కాగితాలు సబ్మిట్ చేయాలో వాటి వివరాలు ఇచ్చిదాన్ని అప్లై చేసే విధానాన్ని వివరించాడు.

త్రివిక్రం పెళ్ళి రోజులోగా అతను ఆశపడ్డట్టుగా నవనీత్ ఉనికిని డిటెక్టివ్ ఏజెన్సీ వారు కనుక్కోలేకపోయారు. సత్యసాయి నిగమాగమం కళ్యాణ మండపంలో వారి వివాహం జరిగింది. చాలామంది 'పెళ్ళికొడుకు బాగ పెద్ద. ఎలా చేసుకుంటోందో?' అని కామెంట్ చేసారు. ఆ పెళ్ళికి అలెగ్జాండర్, కురుంగేశ్వర్. అతని కొడుకులు బ్రహ్మేశ్వర్, కూర్మరాజు హాజరయ్యారు. హరినాథ్ కొడుకు నిక్షేప్, కూతురి మహిమ అమెరికానించి పంపిన పూలబుకే పెళ్ళిరోజు డెలివరీ అయింది. జనని ఫ్రెండ్ మాయాదేవి, లక్నోనించి హైద్రాబాద్ వచ్చి ఉన్న జమునారాణి హాజరయ్యారు. సృజన, త్రివిక్రం తల్లి ప్రమీల భర్త విశ్వేశ్వరరావులు, త్రివిక్రం మిత్రులు జగ్గయ్య, దినాధిపతిలు కూడా హాజరయ్యారు. తన మనవడి పెళ్ళికి ఎదుర్లంక నించి ప్రత్యేకంగా మధుసూదనరావు వచ్చాడు. తనని ఆహ్వానించినందుకు, తాతగా త్రివిక్రం తనకి తగిన గౌరవం ఇచ్చినందుకు ఆయనకి ఎంతో ఆనందం వేసింది. లాయర్ భాస్కర్ మూర్తి కూడా వచ్చి అక్షింతలు వేసాడు. తోటి డాక్టర్లు జాబాలి, విరజ, మరి కొందరు తిరుమలాంబ, ఆమె కూతురు సుభద్ర వచ్చారు. జనని జీవించి ఉండగా వారింట్లో ఉండి చదువుకుని ఛార్టెడ్ అకౌంటెంట్ అయిన రామం, ప్రొఫెసర్ అయిన శీను అతిథులని ఆహ్వానించి వారికి కూల్ డ్రింక్స్, స్నాక్స్ అందే డ్యూటీ తీసుకున్నారు.

పెళ్ళికి భాస్కరమూర్తి బహుమతిగా ఇచ్చిన పుస్తకంలో ఇలా రాసి ఉంది.

'థాంక్ యు, సారీ అనేవి వైవాహిక జీవితంలో శక్తివంతమైన రెండు పదాలు. మొదటిది హృదయపు తలుపులని తెరిస్తే రెండోది హృదయపు గాయాలకి చికిత్స చేస్తుంది.'

జాబాలి బహుమతిగా ఇచ్చిన 'టు కిల్ ఏ మాకింగ్ బర్డ్' అనే పుస్తకంలో ఇలా రాసి ఉంది.

'డియర్ విక్కీ, ఇక నీకు ఉగ్రవాదం అంటే ఉండదు. ఎందుకంటే నీకు పెళ్ళయింది కదా.'

స్ఫూర్తి తన మిత్రులతో ఈ మాట చెప్పడం త్రివిక్రం విన్నాడు.

"మా వారు అన్నారు నాతో, 'నేను నీ వయసుకి రాలేను. కాని చచ్చినట్లు నువ్వు నా వయసుకి రావాలి. బావుళ్ళా?"

తన కొడుకు వివాహం జరుగుతోందన్న అవగాహన రాంప్రసాద్‌లో పెద్దగా కనిపించలేదు. పెళ్ళికి హాజరైన తన ఇద్దరు సోదరులని కాని, జానకిని కాని ఆయన గుర్తించలేదు. రాంప్రసాద్ లేచి ఎటైనా వెళ్ళిపోతే ప్రమాదం అని తమ్ముడు సోమశేఖర్ ఆయన పక్కనే కూర్చున్నాడు. శ్యామలరావు పెళ్ళిలో లంచ్ దగ్గర ఉండి ప్లేట్స్ లెక్కలు, అందరికీ అన్నీ అందేలా చూసాడు. అతనికి సుందరేశ్వర్ సలహా ప్రకారం ఖరీదైన బట్టలని పెట్టాడు త్రివిక్రం.

అలెగ్జాండర్ జెరూసలెం, ఫ్రాన్స్ టూర్, త్రివిక్రం హనీమూన్ టూర్ ఒకే రోజు మొదలయ్యాయి.

సుందరేశన్, త్రివిక్రం పిన్నీ, బాబాయ్‌లు హనీమూన్‌కి పెళ్ళయిన మర్నాడే బయలుదేరమని త్రివిక్రంకి పెళ్ళికి ముందే సలహా ఇచ్చారు. ఆ ప్రకారం పెళ్ళయిన మర్నాడు కొచ్చిన్ నించి క్రూయెజ్‌లో మారిషస్‌కి, తిరుగు ప్రయాణం విమానంలో ఏర్పాట్లు చేసాడు త్రివిక్రం.

పదిరోజులు మారిషస్‌లో గడిపాక, తిరిగి విమానంలో నవదంపతులిద్దరూ మద్రాసు ఎయిర్‌పోర్టుకి చేరుకున్నారు విమానంలోని ది హిందూని చదివి స్ఫూర్తి తన భర్తకి దాన్ని ఇచ్చి చెప్పింది.

"ఈ ఆర్టికల చదవండి."

అది వార్తకాదు. భారతదేశంలోని లంచగొండితనం మీద రాసిన ఆర్టికల్. అందులో కాంట్రాక్టర్ అవినీతి పరుడు కాకుండా నిజాయితీ పరుడైనా లంచం ఇస్తే కాని ప్రభుత్వాధికారులు పని చేయకపోవడం మీద ఉదాహరణగా ఓ సంఘటనని దాని రచయిత పేర్కొన్నాడు. 'నవనీత్ మూడేళ్ళ క్రితం మహారాష్ట్రలో సంగ్లీలో ఎలక్ట్రిసిటీ బోర్డ్ కాంట్రాక్ట్‌లు చేసాడు. బిల్లు చెల్లింపు విషయంలో ఓ అధికారి లంచం డిమాండ్ చేసాడు. కానీ సకాలంలో నాణ్యతగా పని పూర్తిచేసాక ఇక తను లంచం ఇవ్వనని నవనీత్ చెపితే ఆ అధికారి ససేమిరా అన్నాడు. అతని వైఖరి మీద నిరసనని వ్యక్తం చేస్తూ నవనీత్ వారి ఆఫీస్ ముందు భిక్షాపాత్ర పట్టుకుని 'సూపరింటెండెంట్ ఇంజనీర్ కేల్కర్‌కి లంచం ఇవ్వాలి, దానం చేయండి' అని యాచించసాగాడు. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి నవనీత్ చేత ఆ యాచనని ఆపించారు. ఇది మీడియా దృష్టికి వెళ్ళడంతో లంచం ఇవ్వకుండానే అతని బిల్లుని చెల్లించారు.'

"ఇతను నా తండ్రి నవనీత్ అయి ఉండచ్చా?" అడిగాడు.

"కావచ్చు. వెళ్ళగానే ప్రయత్నిద్దాం" స్ఫూర్తి చెప్పింది.

తిరిగి వచ్చాక డిటెక్టివ్ ఏజన్సీకి ఆ వార్తని చూపించాడు త్రివిక్రం. వారు రెండురోజుల తర్వాత ఫోన్ చేసి చెప్పారు. "మీరు వెదికే నవనీతే ఆయన."

"థాంక్ గాడ్" చిన్నగా నిట్టూర్చాడు త్రివిక్రం.

"థాంక్స్ స్ఫూర్తి. నేను ఎన్ని ప్రయత్నాలు చేసినా కనుక్కోలేకపోయాను. నీ వల్లే నవనీత్ ఉనికి ఇట్టే తెలిసింది."

"నా గొప్పేం లేదు. ఛాన్స్ ఎన్‌కౌంటర్. అంతే" చెప్పింది స్ఫూర్తి.

డిటెక్టివ్ ఏజన్సీ వారు ఇచ్చిన సంగ్లీలోని చిరునామాకి త్రివిక్రం మర్నాడే చేరుకున్నాడు. నవనీత్ కొడుకు అనిల్ దత్‌ని కలిసాడు. అతను కూడా డాక్టరే. నవనీత్ పోయి రెండేళ్ళు అయింది అని అతను చెప్పాడు. అనిల్‌కి జరిగింది మొత్తం వివరిస్తే అతను ఆశ్చర్యంగా విన్నాడు. అతనికి తన తండ్రి గత చరిత్ర ఏమీ తెలీదు.

"జస్ట్ టు మేక్ ష్యూర్, మనిద్దరికీ డి.ఎన్.ఏ టెస్ట్ చేయిద్దాం."

అతను అభ్యంతరం చెప్పకుండానే తన రక్తాన్ని ఇచ్చాడు.

ఈసారి డి.ఎన్.ఏ రిజల్ట్ వచ్చినప్పుడు త్రివిక్రంలో ఎలాంటి ఆదుర్దాలేదు. నవనీత్ కొడుకు అనిల్ దత్ డి.ఎన్.ఏ తన డి.ఎన్.ఏతో మేచ్ అవుతుంది అనుకున్నాడు. అతను ఊహించినట్లుగా జరగలేదు. ఆ డి.ఎన్.ఏలు కూడా కలవలేదు. అంటే నవనీత్ వల్ల తన తల్లి ప్రమీలకి గర్భం రాలేదని త్రివిక్రం గ్రహించాడు.

స్ఫూర్తి, సుందరేశ్వర్‌లతో ఆ విషయం చర్చించాడు.

"ప్రమీల భర్త విశ్వేశ్వరరావు డి.ఎన్.ఏతో మీ డి.ఎన్.ఏ మేచ్ చేసి చూడండి" వారు ఇద్దరూ సలహా ఇచ్చారు.

త్రివిక్రం భరత్ నగర్‌లోని సృజన, విశ్వేశ్వరరావుల దగ్గరకి వెళ్ళి ఆ సంగతి చెపితే వారు ఇద్దరూ షాకయ్యారు. ఆయన రక్తం సేంపుల్ తీసుకున్నాడు త్రివిక్రం. రెండు రోజుల తర్వాత ఆ పరీక్ష రిజల్ట్ వచ్చింది. ఈసారి ఎలాంటి అనుమానం లేకుండా విశ్వేశ్వరరావే త్రివిక్రం తండ్రి అని తేలింది.

వెంటనే ఫోన్ చేసి త్రివిక్రం ఆ సంగతి ఆయనకి చెప్పాడు.

"నేను ప్రమీల గర్భానికి ఆ బలత్కారమే కారణం అని గుడ్డిగా నమ్మాను తప్ప నా వల్ల గర్భవతి అయి ఉండచ్చని ఒక్క క్షణం కూడా నాకు ఆలోచన రాలేదు. ప్రమీలకి అంతకన్నా రాలేదు" విశ్వేశ్వరరావు బాధగా చెప్పాడు.

"నా కొడుకు సుశీల్, కూతురు ప్రవీణలకి వారి పెద్దమ్మకి జరిగిన ఆ దుర్ఘటన గురించి ఇంతదాకా తెలీదు. దాన్ని వారినించి గోప్యంగానే ఉంచుదాం." విశ్వేశ్వరరావు త్రివిక్రంని కోరాడు.

"అలాగే"

ఆయన రాంప్రసాద్‌ని చూడటానికి తన భార్య సృజనతో త్రివిక్రం ఇంటికి వచ్చాడు. ఆయన్ని చూడగానే రాంప్రసాద్ చెప్పాడు.

"ఇతను..ఇతను..."

"ఇతను? ఎవరీయన?" త్రివిక్రం ఆత్రంగా ప్రశ్నించాడు.

"ఏమో?"

అంతలోనే ఆయన జ్ఞాపకశక్తి నశించింది.

విశ్వేశ్వరరావు ప్రతీ ఆదివారం, తను త్రివిక్రం ఇంటికి భోజనానికి వెళ్తాడు. లేద వాళ్ళని తన ఇంటికి పిలుస్తాడు. పండగలకి తప్పనిసరిగా తన ఇంటికే ఆహ్వానిస్తాడు. స్వంత కొడుకు మీద చూపించే ప్రేమని విశ్వేశ్వరరావు, సృజనలు త్రివిక్రం మీద చూపిస్తున్నారు.

"రక్తసంబంధం" నవ్వుతుంది స్ఫూర్తి.

20

2014లో ఓ రోజు డైరీలో త్రివిక్రం ఇలా రాసాడు.

ఈరోజు నా పుట్టినరోజు. నవ్వులరోజు. బహుమతుల రోజు. కొత్త బట్టల రోజు. హాల్ మార్క్ గ్రీటింగ్ కార్డులు అందుకునే రోజు. ఈ రోజు మా నాన్న నాకు లేని మొదటి పుట్టినరోజు. నాకు ఊహ తెలిసినప్పటినించి నాకో తండ్రి నా ప్రతి పుట్టినరోజుకీ ఉన్నారు. కానీ ఇవ్వాళ ఆయనలేరు. సికింద్రాబాద్‌లోని స్మశాన వాటికలో మా అమ్మ చితి కాలిన సిమెంట్ ఫ్లాట్ ఫాం మీదే ఆయనా చితిలో కాలిపోయారు.

నిజానికి ఆయన నన్ను వదిలి ఎక్కడికీ వెళ్ళలేదు. ఆయన నా సమీపంలోనే ఉన్నారు. ఆయన ఉనికి నాకు ఎప్పుడూ కొత్తగానే ఉంటుంది.

ఆయన నాకు చాలా నేర్పారు. గెడ్డం గీసుకోవటం ఆయనే నాకు నేర్పారు. నా మొహానికి ఏ రకం మీసం బాగుంటుందో ఆయనే సూచించారు. ఎన్నడూ అప్పుల్లో పడకూడదని, నిత్య దైవ ప్రార్థన చేయాలని నేర్పారు. చీకటికి భయపడకుండా ఉండటాన్ని, బొంగరం ఎలా తిప్పి అరచేతిలో వేసుకోవాలో నాకు నేర్పించారు. ఇంకా ఎన్నింటినో.

ఓల్డ్ స్పైస్ ఆఫ్టర్ షేవ్ లోషన్ వాసన నాకు ఆయన్ని గుర్తు చేస్తుంది. తెల్ల దుస్తులు వేసుకునే వారిని చూసినా ఆయన గుర్తుకు వస్తారు. అసలు నేను మా నాన్నగారిని మరిచింది ఎప్పుడు? ఎవరి జీవితం అయినా నా జీవితంలానే 'అనగనగా ఓ నాన్న'తోనే మొదలవుతుంది.

*(సమాప్తం)*

Post your comments

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి

www.anandbooks.com
www.telugubooks.in